
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

ఆదివారం 14 ఏప్రిల్ 2024

ఫైనాన్స్ నిర్వాహకుల ఇళ్లపై పోలీసుల దాడులు 8లో..

రైస్ మిల్లులకే నేరుగా ధాన్యం తరలింపు 8లో..

జగిత్యాల బల్దియాపై విజిలెన్స్

- వాహనాల కొనుగోలు, రిపేర్లు, పనుల కేటాయింపు, టెండర్లు అక్రమ అనుమతులపై దృష్టి
- టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సానిటేషన్ విభాగాల్లో అక్రమాలు జరిగినట్లు అనుమానం
- బల్దియా అక్రమార్కుల్లో ఆందోళన





జగిత్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో కమిషన్లు... వి ధులకు డుమ్మా కొడుతూ పనిచేయకుండానే వేతనాలు...టెండర్లలో గోల్ మాల్...ఇంటి నిర్మాణ అనుమతిలో అక్రమాలు... అవినీతి..పారిశుధ్య..నీటి సరఫరాకు కావాల్సిన మెటీరియల్, వాహనాల కొనుగోళ్లలో చేతివాటం చెత్త తరలించే వాహనాలకు వినియోగించాల్సిన పెట్రోలు, డీజిల్ పక్కదారి... ట్రేడ్ లైసెన్స్ రుసు ము వసూళ్లలో ఇష్టారాజ్యం...ఇలా అడుగడుగునా జగిత్యాల మున్సిపల్‌లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెత్తనం చెలాయిస్తూ అవినీతి, అక్రమాల వారసత్వానికి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. జగిత్యాల మున్సిపల్‌లోని రెవెన్యూ విభాగం, టౌన్ ప్లానింగ్, సానిటేషన్ విభాగాల్లో చేపట్టిన పనుల్లో అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో జగిత్యాల మున్సిపల్‌లోని ఆయా విభాగాల్లో జరిగిన పనుల వివరాలను తెలపాలంటూ మున్సిపల్ కమిషనర్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం నుంచి లేఖ రావడంతో అక్రమార్కుల్లో ఆందోళన చోటుచేసుకుంటోంది.

● అవినీతి, అక్రమాల ఫిర్యాదుతోనే...

జగిత్యాల మున్సిపల్‌లో విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ పలువురు ప్రజాప్రతినిధులు, పౌరులు ఇటీవల ప్రభుత్వానికి చేసిన ఫిర్యాదు ఆధారంగా విజిలెన్స్ అధికారులు విచారణ ప్రారంభించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కరీంనగర్ రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఈనెల 3వ తేదీన ఆర్‌వీఈవో/కేఎస్‌ఆర్/ ఈడబ్ల్యూ-31/2024 నంబరుతో కూడిన లేఖను జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌కు పంపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదే శాలతో జగిత్యాల మున్సిపల్‌కు చెందిన రికార్డుల వివరాలను కోరుతున్నట్లుగా లేఖ ద్వారా తెలిపారు. మున్సిపల్‌లో అధికారుల అవినీతి, ప్రజాధనం దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులపై వివరణాత్మక విచారణ చేయడానికి సమాచారం ఇవ్వాల్సిందిగా మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జగిత్యాల మున్సిపల్‌లో 2023 సంవత్సరానికిగానూ వివిధ విభాగాలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారాన్ని, రికార్డులను అందించాలని అభ్యర్థించారు.

● సానిటేషన్ విభాగంలో..

మున్సిపల్‌లోని సానిటేషన్ విభాగంలో చోటుచేసుకున్న అవినీతి, అక్ర మాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా పారిశుధ్య వాహనాల కొనుగోలు, మరమ్మతులు, నిర్వహణ తదితర వివరాల పై ఆరా తీస్తున్నారు. చెత్తను తరలించడానికి వినియోగిస్తున్న ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల కొనుగోలు, మరమ్మతులను పూర్తి చేయడానికి కేటాయించిన బడ్జెట్ కేటాయింపు, ప్రస్తుతం పనిచేయని వాహనాల రిజిస్టర్‌లు, మరమ్మతులు ప్రారంభిస్తున్న విధానం, మరమ్మతులు తీర్చడానికి కేటాయిస్తున్న నిధుల మంజూరు పద్ధతి, ఇప్పటికే మరమ్మతులు చేసిన వాహనాల రిజిస్టర్లను అందించాలని ఆదేశించారు. రిపేర్ దుకాణాలు, వాహనాలు కొనుగోలు చేసిన షోరూమ్‌లు, సంబంధిత వాహనాలకు చెందిన రికార్డులు అందించాలని కోరారు. కాలం చెల్లిన వాహనాల స్టాక్ ఎంట్రీ, కొనుగోలు చేసిన వాహనాలు, జారీ అయిన కొత్త వస్తువుల వివరాలను అడిగారు. వాహనాల సంరక్షణకు చెందిన అధికారి రిజిస్టర్‌ను సమర్పించాలని సూచించారు. వాహనాలకు వినియోగించే పెట్రోలు, డీజిల్ రిజిస్టర్, పారిశుధ్యం కోసం ఉపయోగించే వాహనాలకు కోసం నిర్వహించబడే లాగ్ బుక్‌ల జాబితా, వాహనాల స్టాక్ రిజిస్టర్, ఫాగింగ్ యంత్రం కొనుగోలు, నిర్వహణ, సీజనల్, కలుషిత వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలు, ఖర్చుల వివరాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్న రసాయనాల స్టాక్ రిజిస్టర్, స్ప్రేయింగ్ నిర్వ హణపై వార్డు, జోన్‌ల వారీగా పంపిణీ నమోదు వివరాలను అందించాల్సి ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు జారీ చేయబడిన స్వీపింగ్ మెటీరి యల్స్‌కు సంబంధించిన టెండర్లు, పనులు, అగ్రిమెంట్‌లు, చెల్లింపులు వివరాల జాబితాలను సేకరించడంపై దృష్టి సారించారు.

● బయోమెట్రిక్ అటెండెన్స్... ప్లాస్టిక్ కవర్లపై...

పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు సోదాలు జరిపి పలు హోటళ్లు, దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్న వ్యవహారంపై సైతం విజిలెన్స్ దృష్టి సారించింది. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్ల స్టాక్ రిజిస్టర్లను, పార వేసిన ప్లాస్టిక్ కవర్ల రిజిస్టర్లను, వీటిపై వచ్చిన ఫిర్యాదు కాపీలు అందజేయాలని విజిలెన్స్ కోరింది. అదేవిధంగా మున్సిపల్‌లో బయోమెట్రిక్ అటెండెన్స్ రికార్డులను అందించాలని, ఉద్యోగుల, సిబ్బంది వేతనాల చెల్లింపు, బయోమెట్రిక్ పనిచేయని కాలంలో నమోదు చేయబడిన హాజరు వివరాలను విజిలెన్స్ అధికారులు సేకరిస్తున్నారు.

● టౌన్ ప్లానింగ్ విభాగంలో...

మున్సిపల్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకున్న అక్రమాలు, అవినీతిపై సైతం విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. పట్టణంలో జారీ చేయబడిన భవన నిర్మాణ అనుమతుల జాబితా, అక్రమ, అనధికార నిర్మాణాల కోసం జారీ చేయబడిన నోటీసులు జాబితా రిజిస్టర్, వివరాలను అందజేయాలని విజిలెన్స్ అధికారులు లేఖలో కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కూల్చివేసిన అక్రమ, అనధికార నిర్మాణాల జాబితాను, నమోదిత వాణిజ్య దుకాణాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ జాబితా, ట్రేడ్ లైసెన్స్ అసెస్‌మెంట్ వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ రుసు ము వసూలు చేయడం, దీనిద్వారా మున్సిపల్‌కు వచ్చే ఆదాయం వివరాలు, ఫీజు చెల్లించకుండా నడుస్తున్న వాణిజ్య దుకణాల వివరాలను సమర్పించాల్సిందిగా ఆదేశించారు. మున్సిపల్ అధికారులు అసెస్‌మెంట్ చేయడంతో తగ్గిన లైసెన్స్ ఫీజు వివరాలు, ఫ్లెక్సీ ప్రచార పోస్టర్ల తొలగింపు కోసం వెచ్చించిన డబ్బులు వివరాలను అందించాలని ఆదేశించారు.

● ప్రజాప్రతినిధుల్లో రాజకీయం... అధికారుల అలసత్వం వల్లే...

జగిత్యాల మున్సిపల్‌లో రెండేళ్లగా ప్రజాప్రతినిధుల మధ్యన చోటుచేసుకుంటున్న రాజకీయం, అధికారులు బదిలీలు, అలసత్వం కారణంగా ఉద్యోగులు, సిబ్బందిదే ఇష్టారాజ్యంగా మారిందన్న ఆరోపణలున్నాయి. గత కొంత కాలంగా మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు, రాజకీయ ఎత్తులు, పై ఎత్తులపైనే ప్రజాప్రతినిధులు ప్రధానంగా దృష్టి సారించారు. రాజకీయ స్వలాభాల కోసం ప్రయత్నిస్తుండడం వల్ల పరిపాలనగాడి తప్పిందన్న ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో మున్సిపల్ కమిషనర్లు తరుచూ మారుతుండడంతో అడ్మినిస్ట్రేషన్ పట్టు కోల్పోయిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా టౌన్ ప్లానింగ్, సానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో అడ్డగోలు అక్రమ వసూళ్లు, అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని పలువురు కౌన్సిలర్లే గగ్గోలు పెడుతుం డడం పరిస్థితికి అద్దం పడుతోంది. మున్సిపల్ లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను నిరోధించడానికి విజిలెన్స్ అధికారుల జోక్యంతోనైనా పరిస్థితిలో మార్పు వస్తుందన్న ఆశ తో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

విజిలెన్స్ మెయిల్ డస్ట్‌బిన్‌లోకి..?

ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం నుంచి జగిత్యాల మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన మెయిల్‌ను అధికారులు డస్ట్‌బిన్‌లోకి నెట్టివేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. మున్సిపల్‌లో జరిగిన అక్రమాలు, అవినీతి ఆరోపణలపై విచారణ జరపడానికి అవసరమైన సమాచారాన్ని అందించాలని కోరుతూ విజిలెన్స్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యా లయానికి పంపిన మెయిల్‌ను నిర్లక్ష్యం చేస్తూ డస్ట్‌బిన్‌లోకి నెట్టివేసినట్లు గా సంబంధిత వర్గాలు గుసగుసలాడుతున్నాయి. దీంతో తాజాగా విజిలె న్స్ అధికారులు ప్రత్యేకంగా లేఖను పంపినట్లు తెలుస్తోంది.

రవీంద్ర ప్లే స్కూల్‌లో అంబరాన్నంటిన సంబరాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

జగిత్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రవీంద్ర ప్లే స్కూల్‌లో శనివారం రవీంద్ర ఉత్సవ్-2కే24 పేరిట నిర్వహించిన పదకొండవ వార్షికోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాల నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పలు దేశ భక్తి, సినీ, జానపద గేయాలపై విద్యార్థులు ఇచ్చిన నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శివ తాండవం, చిన్నారుల భరత నాట్యం, నర్సరీ పిల్లలు అమ్మ పాటపైన వారి తల్లులతో చేసిన నృత్యాలు అలరించాయి. పాఠశాల నిర్వాహకులు సుమన్ రావు,ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, రజిత, హరిచరణ్, మౌనిక, కిషన్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులకు కష్టాలే

నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

రాయికల్, ఏప్రిల్ 13: దొంగ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతలకు కష్టాలేనని నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రాయికల్ పట్టణంలోని లక్ష్మి గార్డెన్స్‌లో శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో రాయికల్ పట్టణ, మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా విలువలతో కూడిన రాజకీయం చేశానని, కానీ ఇప్పుడు రాజకీయాలు కమర్షియల్ అయ్యాయని, రేవంత్‌రెడ్డి కమర్షియల్ సీఎం అని విమర్శించారు. ప్రజల కష్టాలు తెలిసింది కేసీఆర్ ఒక్కరే అన్నారు. బీఆర్ ఎస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ తప్పుడు వాగ్ధానాలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. షుగర్ ఫ్యాక్టరీ పేరుతో కాంగ్రెస్ ప్రజలను మరో సారి మోసం చేయాలని చూస్తుందన్నారు. అర్వింద్ గెలిచిన ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు తెస్తానని చెప్పి ఇప్పుడు అంతకన్నా మంచి బోర్డు తెచ్చామని చెప్పడం సిగ్గుచేటన్నారు. జడ్పీ చైర్మన్ దావవసంత సురేష్, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, మాజీ మా ర్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపు రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవీ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, జడ్పీటీసీ అశ్విని జాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిఅచ్యుత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, పాల్గొన్నారు.

జగిత్యాల యువకుడికి గోల్డ్ మెడల్

జగిత్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ అరిగెల అభినవ్ మాస్టర్ ఆఫ్ సైన్స్ జనరల్ సర్జరీ పూర్తి చేసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను గోల్డ్ మెడల్ అందుకున్నారు. పూణే సమీపంలోని పింప్రిలో గల డివై పాటిల్ మెడికల్ కళాశాలలో ఎంఎస్ జనరల్ సర్జరీ పూర్తి చేసిన అభినవ్ విద్యా పీఠం ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

జగిత్యాల పట్టణానికి చెందిన అభినవ్ అపోలో ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రిజెర్చ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ప్రస్తుతం మల్లారెడ్డి మెడికల్ కళాశాలలో జూనియర్ రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. 'గ్రూప్ ఫ్యాంక్రియాటైటిస్ విత్ గ్యాస్ట్రిక్ అవుట్లెట్ అబ్ స్ట్రక్షన్' అనే అంశంపై పోస్టల్ ప్రజెంటేషన్, 'మాలిగ్నేంట్ పెరిఫెరల్ నర్వ్ షీట్ ట్యూ మర్ ఇన్ పోస్టి యర్ ట్రయాంగిల్ ఆఫ్ నెక్' అను అంశంపై పేపర్ ప్రజెం టేషన్ చేసి గోల్డ్ మెడల్ సాధించారు. అభినవ్‌ను పలువురు అభినందించారు.

అర్వింద్ ఎంపీ పదవి ఎక్స్‌పైరీ అయిపోయింది

ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 13: ఐదేళ్లపాటు పదవిలో ఉండి అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచిన అర్వింద్‌కు ఎంపీ పదవి ఎక్స్‌పైరీ అయిపోయిం దని ఈ సారి తనకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఓటర్లను కోరారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ జగిత్యాల పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. జీవన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఎంపీగా అవకాశం ఇస్తే ఇందురూ ను భారతదేశంలోనే గుర్తింపు తీసుకవచ్చేలా అభివృద్ధి చేయడంతో పాటు తన గళాన్ని పార్లమెంట్‌లో వినిపిస్తానన్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగానే మారుస్తామని అంటున్న బీజేపీ నాయకుల మాటలను ఎమ్మెల్సీ తప్పుబట్టారు. డాక్టర్ బాబా సాహేబ్ రూపొందించిన రాజ్యాంగం మన అందరి హక్కు అన్నారు. ఛాయ్‌పే చర్చలో పాల్గొని ఇష్టం వచ్చినట్లు అర్వింద్ మాట్లాడుతున్నారని ఏనాడైనా ఈ ప్రాంత బీడీ, గల్ఫ్ కార్మికుల సమస్యలు పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. జగిత్యాల నుంచి మంచిర్యాలకు రైలు కనెక్టివిటీతో పాటు జగిత్యాల ప్రాంత వాసులకు తిరుపతి రైలు సౌకర్యం, ముం బాయి రైలు జగిత్యాలలో ఎందుకు హాల్టింగ్ చేయడంలేదో అర్వింద్ సమాధానం చెప్పాలన్నారు. ఎంపీగా గెలిచిన తక్షణమే తిరుపతి రైలు సౌకర్యంతో పాటు మంచిర్యాలకు నూతన రైల్వే ట్రాక్, ముంబయి ట్రైన్ జగిత్యాలలో ఆగే విధంగా చర్యలు తీసుకుంటామని జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆరు నూరైనా రాష్ట్రంలో మూత పడ్డ మల్లాపూర్, బోధన్, ముమ్మోజిపల్లి శర్కర ఫ్యాక్టరీలను తెరిపించే బాధ్యత తాను తీసుకుంటానని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు పసుపు బోర్డు తెస్తానని గెలిచిన అర్వింద్ అనంతరం కేవలం కాగితాల్లోనే పసుపు బోర్డును చూపిస్తూ రైతులను మోసం చేస్తున్నాడన్నారు. మొన్నటి దాకా కాంగ్రెస్ డీఎస్‌ఏగా ఉన్న అర్వింద్ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. పాకిస్థాన్ మెడలు వంచి బంగ్లాదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడంలో ఆనాడు కాంగ్రెస్ పార్టీ కీలకంగా వ్యవహరించి శత్రు దేశం లేకుంగా చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో అవకాశం ఇచ్చి ఆశీ ర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో టీసీపీపీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య నాయకులు దేశాయ్, కమటాల శ్రీనివాస్, మహంకాళి రాజన్న, సత్యనారాయణ, జిల్లా గంగాధర్, పిప్పరి అనిత, శోభారాణి, సుమ, లత, గుంటి జగదీశ్వర్, ఎల్లారెడ్డి, శైలేందర్ రెడ్డి, మన్సూర్, కౌన్సిలర్లు ఉన్నారు.

సీఎంను కలిసిన మున్నూరు కాపు సంఘ నాయకులు



సీఎంను కలిసిన మున్నూరు కాపు సంఘ నాయకులు

జగిత్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్ జూబ్లీ హిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు జగిత్యాలకు చెందిన పలువురు మున్నూరు కాపు సంఘ నాయకులు కలిశారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సంఘ నాయకులు బండారి రాజ్ కుమార్, అంజయ్య, అంగలి రాజన్న పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

ధర్మపురి, ఏప్రిల్ 13: ధర్మపురి మండలంలో ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లీడింగ్ ఫైర్ ఆఫీసర్ లక్ష్మినారాయణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అగ్ని నివారణ చర్యలు చేపడుదాం-దేశ సంపదను కాపాడుదాం అనే వాల్ పోస్టర్‌ను ఎస్ఐ ఉమా సాగర్‌తో కలిసి ఫైర్ సిబ్బంది శనివారం ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది జ్ఞాపకార్థం ప్రతి సంవత్సం ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా అమరులైన అగ్నిమాపక సిబ్బందికి జోహార్లు అర్పించామన్నారు. అగ్నిప్రమాదాలు జరుగకుండా ప్రజలను చైతన్యవంతులను చేయడం అనేది ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాం మూర్తి, అగ్నిమాపక సిబ్బంది ఎండీ రఫిక్, ఎండీ అఫ్జాద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 13: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతోపాటు సంక్షేమ రంగానికి సంబంధించిన మెస్ బిల్లుతో పాటు డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ డిగ్రీకళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా మూడో మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షుడు మంద అనిల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్‌లకు సంబంధించిన డైట్ చార్జీలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను మూడువేల రూపాయలకు పెంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి లేకపోతే సమస్యలపై ఏవిధంగా చర్చిస్తారన్నారు. పెండింగ్‌లో ఉన్న 7,800కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయడంతోపాటు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్, రాకేష్, సహాయ కార్యదర్శి కళ్యాణ్, అనూష తదితరులు పాల్గొన్నారు.

అపర భద్రాద్రికి బ్రహ్మోత్సవ శోభ



- సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం
- రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించనున్న కలెక్టర్ పమేలా సత్పతి
- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

ఇల్లందకుంట, ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 27వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 17న శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయ చరిత్ర రామాయణంతో ముడిపడి ఉంది. త్రేతాయుగంలో రాముడు, లక్ష్మణుడు, సీతా అరణ్య వాసం చేస్తూ ఇక్కడ సేద తీరుతన్న సమ యంలో తన తండ్రి దశరథ మహరాజు మరణ వార్త తెలిసింది. ఇక్కడి ఇల్లంద వృక్షం పలుకులతో శ్రీరాముడు తన తండ్రికి శ్రాద్ధకర్మలు జరిపించారని ఆలయ పూజారులు చెబుతారు. అప్పటి నుంచి ఈ గ్రామానికి ఇల్లందకుంట అని పేరు పెట్టారు. ఇల్లందకుంట ఆలయంలో సీతారామచంద్రులను పుట్టు దేవుడిగా అభివర్ణిస్తారు. ఆలయ ఉత్సవ మూర్తులకు పుట్టు మచ్చలు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. రాముడు అరణ్యవాసంలో భాగంగా ఇక్కడ 13 రోజులు ఈ పరిసర గ్రామాల్లో సంతరించాడని పెద్దలు చెబుతారు. అందుకే ఈ గ్రామాల పేరు లక్ష్మాజిపల్లె, శ్రీరాములపల్లె, సీతంపేట, సిరిసేడు, లక్ష్మన్నపల్లెగా ఉన్నాయి. ఈ నెల 15నుంచి 27వరకు జరగనున్న బ్రహ్మో త్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతి, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయ కార్యానిర్వాహణాధికారి కందుల సుధాకర్ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. హుజూ రాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు, ఏసీపీ శ్రీనివాస్‌జీలు స్థానిక అధికారులచే సమీక్ష సమావేశాలు నిర్వహించారు.


శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు

● లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

బ్రహ్మోత్సవాలకు సుమారు లక్షకుపైగా భక్తులు హాజరు కానున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు (శ్రీరామనవమి రోజు) జమ్మికుంట కాటన్, రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య సదుపాయం అందించేందుకు 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ శ్రీనివాస్‌జీ, జమ్మికుంట రూరల్ సీఐ కోరె కిశోర్, ఎస్ఐ రాజకుమార్‌ల భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఆలయ పరిసరాల్లో 18 సీసీ కెమెరాలు అమర్చారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం.

- కందుల సుధాకర్, ఆలయ ఈవో, ఇల్లందకుంట



దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి.

బ్రహ్మోత్సవాల వివరాలు

- 15న సోమవారం రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తుల బాహ్యమందిర ప్రవేశం
- 16న మంగళవారం సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ
- 17న బుధవారం ఉదయం 9గంటలకు ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ట, ఉదయం 10 గంటలకు ఎదుర్కోళ్లు, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం, రాత్రి 9 గంటలకు శేషవాహన సేవ
- 18న గురువారం ఉదయం 10 గంటలకు పట్టాభిషేకం, సువర్ణ పుష్పార్చన, సాయంత్రం 6 గంటలకు ప్రభుత్వోత్సవం ప్రారంభం
- 19న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్వోత్సవం, రాత్రి 9 గంటలకు గరుడవాహన సేవ
- 20న శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్వోత్సవం, రాత్రి 9 గంటలకు హనుమత్ వాహన సేవ
- 21న ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్వోత్సవం, రాత్రి 9 గంటలకు గజవాహన సేవ, అనంతరం సదస్యం, వేదాశీర్వచనం.
- 22న సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్వోత్సవం ముగింపు, రాత్రి 9 గంటలకు అశ్వవాహన సేవ, దోపోత్సవం.
- 23న మంగళవారం సాయంత్రం 6 గంటలకు శకటోత్సవం, రాత్రి 7గంటలకు సూర్య రథోత్సవం (చిన్నరథం)
- 24న బుధవారం సాయంత్రం 7గంటలకు స్వామివారు చంద్రరథోత్సవం (పెద్దరథం) మీదకు వస్తారు.
- 25న గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులకు స్వామివార్ల దర్శనం, సేవల అనంతరం తిరుమాడ వీధుల్లో చంద్రరోథత్సవం (పెద్దరథం) ఊరేగింపు. రాత్రి 7గంటలకు మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ
- 26న శుక్రవారం ఉదయం 9గంటలకు అష్టోత్తరశత (108) కలశాభిషేకం, అవబృథ చక్రస్నానం. రాత్రి 9గంటలకు ద్వాదశారాధన, శ్రీపుష్పయాగం (నాఖబలి)
- 27న శనివారం రాత్రి 7గంటలకు సప్త వరణాలు, ఏకాంతసేవ

గంజాయిపై ఉక్కుపాదం

- ఐదుగురు విక్రయదారుల అరెస్టు
- రెండు కిలోల గంజాయి సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



మాట్లాడుతున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 13: గంజాయి రవాణా, వినియో గంపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి అన్నారు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. వేములవాడ పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఐదురుగురిని అరెస్టు చేసి వారి వద్దనుంచి రెండు కి లోల గంజాయిని స్వాధీనపరచుకుని సీజ్ చేశామన్నారు. ఉత్తరప్రదే శ్‌కు చెందిన శ్యామ్ దివాకర్, వేములవాడ పట్టణానికి చెందిన మల్లికార్జున్, కామారెడ్డికి చెందిన కట్కూరి భాను, మంచిర్యాలకు చెందిన పరికిపండ్ల అన్వేష్ అలియాస్ బన్ని, వేములవాడ పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన మర్రిపల్లి సురేష్ అనే విక్రయదారుల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న మరికొందరు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలి పారు. గంజాయి మహమ్మారిని తరిమికొట్టడంలో భాగంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వేములవాడ ప్రాంతంలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. గంజాయి విక్రయించినట్లు తెలిసినా, గంజాయి ని సేవిస్తున్నట్లు తెలిసినా పోలీసులకు సమా చారం అం దించాలని లేదా 100కు డయల్ చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో చురుకుగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రాజశేఖర్, తిరుపతి, శంకర్, గోపాల్, సతీష్‌లకు డీఎస్పీ నాగేంద్రచారి రివా ర్డులను అందజేసి అభినందించారు. సమావేశంలో రూరల్, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై మారుతి, టౌన్ ఎస్సై అంజ య్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సిల్ సభ్యుల తనిఖీలు

- 8 క్లినిక్‌లపై కేసులు


నిర్వాహకుడిని వివరాలను అడుగుతున్న డాక్టర్ సురేష్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13: తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ బృందం వైద్యులు డాక్టర్ సరేష్, డాక్టర్ రితేష్, డాక్టర్ గౌతం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో పలు క్లినిక్‌లపై ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. చాలా చోట్ల అనుమతులు లేకుండా ఆర్‌పీలు డాక్టర్లమంటూ ప్రచారం చేసుకుంటూ వైద్యం చేస్తున్నారని వారి తనిఖీల్లో తేలింది. కొందరు బెడ్లు కూడా ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నట్లు తనిఖీ బృందం గుర్తించింది. జిల్లా కేంద్రంలోని గోదాంగడ్డలోని వేంకటేశ్వర వైద్యాలయం, హెవెన్లీ క్లినిక్, హెల్త్‌కేర్ క్లినిక్, రాంనగర్‌లోని లక్ష్మి, సాయిరాం, కావ్య క్లినిక్‌లతో పాటు అర్హి క్లినిక్, సాయిరాం, లలిత పాలి సెంటర్లను తనిఖీ చేశారు. ఇందులో అర్షి క్లినిక్ మినహా మిగతా క్లినిక్‌లన్నీ అర్హత లేకుండా నిర్వహిస్తున్నారని, వారిపై కేసు నమోదు చేసినట్లు డాక్టర్ నరేష్ తెలిపారు. చింతకుంట క్రాస్ రోడ్‌లోని సాయిరాం నర్సింగ్ హోం, లలిత పాలీ సెంటర్, అర్షి క్లినిక్‌లలో అర్హత గల డాక్టర్లు ఉన్నప్పటికీ నర్సింగ్ హోం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు తీసుకోకపోవడంతో వాటికి అనుమతులు తీసుకోవాలని నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. మిగతా క్లినిక్‌ల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు వారు తెలియచేశారు. అర్హత లేకున్నా యాంటిబయాటిక్స్ మందులు రాస్తున్నారని, స్టెరాయిడ్స్ ఇస్తు న్నట్లు తమ తనిఖీల్లో తేలిందన్నారు.

వంతెన నిర్మాణ సామగ్రి చోరీ

ముత్తారం, ఏప్రిల్ 13: మండలంలోని ఓడేడు గ్రామ శివారులోని మానేరుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ సామగ్రి చోరీ జరిగినట్లు సైట్ ఇన్‌చార్జి సయ్యద్ బాబా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఏప్రిల్ 13: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకు న్నారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చర ణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వ హించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

వేములవాడ, ఏప్రిల్ 13: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో రాజరాజేశ్వర స్వామి, సీతారామ చంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. శ్రీరామనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఉద యం రాజరాజేశ్వర స్వామివారి కి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రా భిషేకం, సీతారామ చంద్ర స్వామి వారికి పంచోపనిషత్ ద్వారాభిషేకం, పరివార దేవతార్చనలు నిర్వ హించారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం వేళ లక్ష్మీఅనంతపద్మనాభస్వామి, పార్వతీ రాజరాజేశ్వరస్వామి వార్లను పెద్ద సేవపై ఊరేగించాల్సి ఉండగా, వాతావర ణం అనుకూలంగా లేని కారణంగా పెద్ద సేవను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గోదావరిలో దూకి యువతి ఆత్మహత్య

య్లైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 13: గోదావరిఖనికి చెందిన ఆర్షియా అనే యువతి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బాపూజీనగర్‌కు ఆర్టీసీ ఉద్యోగి అబ్దుల్లా కుమార్తె ఆర్షియా కుటుంబ సమస్యలు, ఆర్థికపరమైన ఇబ్బందులతో శుక్రవారం రాత్రి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అబ్దుల్లా కుమారుడు నిస్సార్ 2020 అక్టోబరులో గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

రెండు కార్లు ఢీ.. ఇద్దరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు


ప్రణయ్‌కుమార్(ఫైల్)

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అతివేగం ఇద్దరి ప్రాణా లను బలితీసుకుంది. నిద్రమత్తులో అతివేగంగా కారు నడిపి డివైడ ర్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయా లయ్యాయి. ఈ ప్రమాదం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన బొల్లం ప్రణయ్‌కుమార్(29) ప్రైవేట్ ఉద్యోగి. మీర్‌పేట్‌లోని నందిహిల్స్‌లో ఉంటున్నాడు. ప్రకాశం జిల్లా సంతనూతల మండలం గుడిపాడు గ్రామానికి చెందిన కుంచాల రవీందర్‌బాబు(29) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ వనస్థలిపురం ఎస్‌కేడీ నగర్‌లో ఉంటున్నాడు. వీరి ద్దరూ స్నేహితులు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి 2.30 గంట లకు స్విఫ్ట్ కారు(టీఎస్22టీప 0898)లో తుర్కయాంజాల్ నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వస్తున్నారు. అదేసమయంలో నల్గొండ జిల్లా మల్లేపల్లి సమీపంలోని వడ్డెమోనిగూడెం తండాకు చెందిన ఇస్లావ త్ దస్రు(26)తన క్రేటా కారు(టీఎస్05ఈసీ0123)తో బీఎన్‌రెడ్డినగర్ నుంచి తుర్కయంజాల్ వైపు వెళ్తున్నాడు. గుర్రంగూడ చౌరస్తా దాటిన తర్వాత నిద్రమత్తులో అతివేగంతో డివైడర్‌ని ఢీకొని అవతలి వైపు నుంచి వస్తున్న స్విఫ్ట్ కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారు లోని బొల్లం ప్రణయ్ కుమార్, కుం చా ల రవీందర్ బాబు తీవ్రంగా గాయపడ్డా రు. సంఘటనా స్థలంలోనే ఇద్దరూ మృ తి చెందారు. ఇస్లావత్ దస్రుకు తీవ్ర గా యాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తర లించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో మరొకరు..

అంతర్గాం: రామగుండం కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ ఏరి యా మల్యాలపల్లి వద్ద రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చొప్పరి ఓదెలు(41) అనే విలేకరి మృతిచెందాడు. రామగుండం ఎస్సై కే సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కుర్మపల్లికి చెందిన ఓదెలు తన ద్విచక్ర వాహనంపై గోదావరిఖని వస్తున్నాడు. భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్28జెడ్0105) వెనుక నుంచి ఢీకొట్టగా ఓదెలు అక్కడికక్కడే మృతిచెందాడు. ఓదెలుకు భార్య స్వరూప, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓదెలు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సతీష్ తెలిపారు.

కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని తేవాలి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 13 : రైతులు కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకరావలని జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, వెల్లుల్లలోని డీసీఎస్‌ఎమ్‌లో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కేంద్రాల్లోని ధాన్యం మ్యాచర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు వచ్చి ధాన్యం తడిచే ప్రమాదం ఉన్నందున వేగవంతంగా కొనుగోలు చేయాలన్నారు. ఇంకా ప్రారంభం కాని చోట వెంటనే కొనుగోలు చేయాలని పలు సూచనలు చేశారు. సివిల్ సప్లై డీటీ ఉమాపతి, ఐకేపీ సీసీలు వెంకటరమణ, శ్రీనివాస్‌లు, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

బీఆర్‌ఎస్ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి, ఏప్రిల్ 13 : అభివృద్ధిని చూసి ఆదరించాలని, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించాలంటూ మాజీ మంత్రి బీఆర్‌ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోరారు. శనివారం పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నంది చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు ప్రధాన రహదారి వెంట ఇరువైపులా దుకాణాలు, ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. పదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి తనను ఈ ఎన్నికలలో ఎంపీగా గెలిపించాలని అందుబాటులో ఉంటూ మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కల్లబొల్లి మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను విస్మరించిందని, తిరిగి నమ్మి మరింత మోసపోకూడదంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సింగిల్ విండో చైర్మన్లు ఓరుగంటి రమణారావు, వేణుగోపాల్, మాదారపు కరుణాకర్ రావు, బొమ్మెన స్వామి, సురేందర్ రెడ్డి, గంగాధర్, రాజేశ్వర్ రావు, ఇరుగురాల ఆనందం, నారెడ్డి రాజిరెడ్డి, కొమురెల్లి ఆనందం పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

కొడిమ్యాల, ఏప్రిల్ 13 : మల్యాల మార్కెట్ మాజీ వైస్ చైర్మన్, కొడిమ్యాల మండల బీఆర్‌ఎస్ నాయకుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, మండలంలోని పూడూర్ గ్రామ మాజీ సర్పంచు పెద్ది కవిత భర్త పెద్ది రవికుమార్, పూడూర్ మాజీ ఉప సర్పంచు బండ లింగారెడ్డి, పలువురు మాజీ పంచాయతీ సభ్యులు మండల బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. బీజేపీ మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో సుమారు 30 మంది కార్యకర్తలు చేరారు. వారికి బండి సంజయ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభ, అసెంబ్లీ కన్వీనర్ శ్రావణ్, కోఆర్డీనేటర్ శ్రీనివాస్ యాదవ్, పలువురు మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

మల్లాపూర్, ఏప్రిల్, 13 : మండలంలోని చిట్టాపూర్ గ్రామంలోని శ్రీ శివభక్త మార్కండేయ స్వామి ఆలయం 47వ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని శనివారం నిర్వహకులు ఘనంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో పురోహితులు ప్రత్యేక పూజా కార్యక్రమలను చేపట్టారు. అనంతరం శివపార్వతుల కల్యాణం, మహా మంగళ హారతి, పూర్ణహుతి వంటి కార్యక్రమాలను జరిపారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కల్వకుంట్ల సుజిత్‌రావు, కొమిరెడ్డి కరంచంద్, విజయ్‌ఆజాద్‌లు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు చెన్న నర్సయ్య, అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్, ఆలయాధ్యక్షుడు అడేపు రాజేష్, పద్మశాలి సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు ముమ్మరం

కథలాపూర్, ఏప్రిల్ 13 : మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. శనివారం మండలంలోని ఇప్పపల్లి, సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పైపులైను లీకేజీలకు మరమ్మతులు పూర్తి చేయించారు. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదనే ఫిర్యాదులు రావడంతో పలు వాడల్లో చెడిపోయిన పైపులను తొలగించి మరమ్మతులు చేపట్టారు. ఎంపీవో ప్రవీణ్ తక్కళ్లపల్లిలో పారిశుధ్య మెరుగు కోసం సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురికి కాలువల్లో మట్టిని తొలగించడంతో పాటు రోడ్లపై చెత్త లేకుండా చూడాలని పేర్కొన్నారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 13 : అకాల వర్షం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో కొన్ని ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యం స్వల్పంగా తడిసింది. మండలంలో వరి కోతలు ప్రారంభమైనందున ధాన్యం విక్రయిం చేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికి అధికారులు కాంటాలు వేయడం లేదు. వేలకు వేలు పెట్టి పండించిన పంటను విక్రయించడానికి గ్రామాల్లో ఐకేపీ, విశాల సహకార సంఘం, ప్రాథమిక సహకార సంఘాలు, డీసీఎమ్‌ఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం పోశారు. కానీ నేటికి ఏ ఒక్క కొనుగోలు కేంద్రాలలో కాంటాలు ప్రారంభించకపోవడం గమనార్హం, దీంతో వాతావరణంలో జరుగుతున్న మార్పులతో అన్నదాతలు భయాందోళనకు గురువుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టడానికి కళ్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద పోశారు. కురుస్తున్న అకాల వర్షానికి ధాన్యం తడుస్తుంది. పొద్దంతా తడిసిన ధాన్యాన్ని ఎండకు ఆరబెట్టడం, రాత్రిల్లో మళ్లీ వర్షం రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎండపల్లి : కారమబ్బులు రైతన్నల పాలిట శాపంగా మారాయి. శనివారం మండలంలో కురిసిన చిన్న పాటి వర్షానికి రైతులు దిగాలు చెందారు. వారం రోజులుగా వరి కోతలు ప్రారంభమయ్యాయి. కోసిన పంటను రైతులు కవర్లతో ధాన్యాన్ని కాపాడుతున్నారు. వర్షం పడితే వడ్లు రాలడమే కాకుండా నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు అంటున్నారు. శనివారం చల్లటి వాతావరణంతో మబ్బు కమ్ముకోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

మల్యాల: రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు కురుస్తున్న చిరుజల్లులకు రైతులు ఆందోళన చెందుతున్నారు. కొను గోలు కేంద్రాలకు తర లించిన దాన్యం చిన్నపాటి వర్షంకు తడిచిపోతుండగా ధా న్యం కాపాడుకోవడానికి రైతులు పాట్లు పడుతున్నారు. అ ఖ్కడే పడి గాపులు పడుతూ దాన్యంపై కవర్లు కప్పుతూ ఆందోళన చెందుతున్నారు. త్వరిత గతిన కొనుగోళ్ల చేపట్టకపోవడంతో తమ ధాన్యం తడిచిపోతుం దని ఆవేధన వ్య క్తం చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన స్వల్ప వర్షా నికి మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోశారు. అయినా చిరుజల్లులు కురుస్తూనే ఉండడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా శ్రీపాదరావు వర్ధంతి

ధర్మపురి, ఏప్రిల్ 13: ధర్మపురి పట్టణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు కాంగ్రెస్ నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నియామకం

వెల్గటూర్, ఏప్రిల్ 13: పాషిగామ ఆంజనేయస్వామి ఆలయ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా గోపతి నరేష్ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బరుపటి అజయ్, వైస్ చైర్మన్‌గా బరుపటి జనార్థన్, కోశాధికారిగా ఎంబడి శ్రీధర్, ప్రచార కార్యదర్శిగా కంటెం మధుకర్ ఎంపికయ్యారు. సభ్యులుగా ఎంబడి చిన్న రాజయ్య, కంటెం సత్తయ్య, బొప్పు తిరుపతి, గోపతి తిరుపతి, పందిగిరి రమేష్, సలహాదారులుగా కొట్టె రవి, ఎంబడి అజయ్, కంటెం ప్రవీణ్, కంటెం అభిషేక్, కంటెం రాజు ఎంపికయ్యారు.

ముందస్తు జాగ్రత్తలతో చర్మ వ్యాధుల నివారణ

జగిత్యాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలు పాటించడం వల్ల పలు చర్మ వ్యాదుల నివారణ సాధ్యమవుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో జరిగిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. పలువురు విద్యార్థులకు చర్మ వ్యాది పరీక్షలను నిర్వహించారు. ఆయన మాట్లాడారు. చర్మ వ్యాదులు ప్రబలకుండా వసతి గృహ విద్యార్థులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది, హాస్టల్ వార్డెన్, ఇతరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులకే నేరుగా ధాన్యం తరలింపు



మల్యాలలో కొనుగోలు కేంద్రంలో గల వరి ధాన్యం

● కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతోనే..
● అసౌకర్యాలతోనూ ఇక్కట్లు
● మద్దతు ధర కన్న తక్కువకే విక్రయాలు



పెగడపల్లిలో ధాన్యం కుప్పలు

మల్యాల, ఏప్రిల్ 14: కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పక్షం రోజులు గడుస్తున్నప్పటికీ కొనుగోల్లు ప్రారంభించకపోవడంతో కొందరు రైతులు వరిధాన్యం విక్రయించడానికి నేరుగా రైస్‌మిల్లులకే తరలిస్తున్నారు. దళారుల బెడద తగ్గించడానికి మద్దతు ధరలు అందించడానికి ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగు తుండగా ప్రతి ఏటా వానకాలం, యాసంగి సీజన్‌లోని ధాన్యాన్ని ప్రభు త్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తుంది. గతేడాది నుంచి రైతులు కొను గోలు కేంద్రాల పట్ల ఆసక్తి చూపడం లేదు. అసౌకర్యాలు, ధాన్యం పోసుకునేందుకు స్థలం కరువు కావడంతో అధిక సంఖ్యలో రైతులు తమ ధాన్యాన్ని కోతల నుంచి నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ధాన్యం కోత కాగానే కొందరు దళారులు గ్రామాల్లో కొనుగోలు చేస్తుండగా కొన్ని చోట్ల రైతులు మిల్లులకు విక్రయిస్తున్నారు. వారం రోజులుగా వాతావర ణంలో మార్పులు రావడం, పదిహేను రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ప్పటికీ తూకం చేపట్టకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు బదులు రైస్‌మిల్లుల వైపు చూస్తున్నారు.

● గతంలో తరుగు.. ఇప్పుడు అకాల వర్షాలు

కొనుగోలు కేంద్రాలలో ఎదుర్కొంటున్న అసౌకర్యాలే రైతులను ధాన్యం మిల్లులకు తరలించేలా చేస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. సాగు చేయడం కన్నా పండించిన దాన్యం విక్రయించడమే అన్నదా తలకు సవాలుగా మారుతోంది. ఆరబోసి, శుద్ధి చేసి నాణ్యమైన ధాన్యం తూకంకు రోజుల తరబడి వేచి ఉండడం.. తూకం అయ్యాక మిల్లర్లు తీసుకోవడం లేదంటూ క్వింటాలుకి 4-5 కిలోల లోపు తరుగు పేరిట కోతలు విధించడం గతంలో చోటుచేసుకోగా, ప్రస్తుతం అకాల వర్షాలు రైతులను ఆందోళన కలిగిస్తోంది.

తేమ శాతం వచ్చి రోజులు గడిచినా తూకం వేయ కపోవడానికి తోడు వాటి డబ్బులు రావడానికి మరో నెల రోజులు గడవడం.. ధాన్యం పోసుకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేకపోవడం కూడా రైతులు రైస్ మిల్లులకు వెళ్లడానికి కారణంగా పలువురు పేర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం రైతులకు క్విం టాలు ఏ గ్రేడ్ దాన్యంకు రూ.2203, కామన్ రకం ధాన్యంకు రూ.2183 చెల్లిస్తుంది. దళారులు, మిల్లర్లు క్వింటాలుకి రూ.1700నుంచి రూ.1900 వరకు చె ల్లిస్తుండడంతో ఆరబోయడం, శుద్ధి చేయడం, రోజుల తరబడి కాపల, వేచి ఉండడం, అసౌకర్యాలు లాంటి ఎలాంటి ఇబ్బందులు ఉండ వని మిల్లుల వైపు మొగ్గు చూపుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. దీంతో మండలంలో అన్ని గ్రామాల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది.

కేంద్రాలు ప్రారంభించారు - తూకం వేయడం మరిచారు

పెగడపల్లి : ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతన్నలు పండిన పంట విక్రయించుకుందామంటే కొనుగోల్లు ప్రారంబం కాక అకాల వర్షాలతో ఏమవుతుందోనంటూ బిక్కు బిక్కు మంటూ ఆకాశం వంక చూస్తున్నారు. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు గాను అన్ని గ్రామాలలో 90 శాతానికి పైగా వరి సాగు కాగా, పక్షం రోజులుగా వరి పొలాలు కోతలు ప్రారంభమై ఆయా గ్రామాలలోని సింగిల్‌విండో, మహిళా సంఘాల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో ధాన్యం కుప్పలు పోసి ఆరబెడుతున్నారు. మండలంలో పెగడపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆద్వర్యంలో 12, నంచర్ల సహకార సంఘం ఆద్వర్యంలో 10, నందగిరి సంఘం ఆద్వర్యంలో 5, ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా దాదాపు అన్ని కేంద్రాలను ఆ యా శాఖల జిల్లా మండల అధికారులచే పది రోజుల క్రితమే రిబ్బన్ కటింగ్‌లు చేసి ప్రారంబించారు. కేంద్రాలను ప్రారంబించడము వరకే త ప్ప ఇప్పటి వరకు మండలంలోని 32 కేంద్రాలకు గాను ఏ ఒక్క కేం ద్రంలో సైతం ధాన్యం తూకం ప్రారంభించలేదు. దీంతో ధాన్యం ఆరబోసి తేమ శాతం వచ్చిన ధాన్యం రైతులు వర్షం వస్తే తమ ధాన్యం తడిసి పోతుందంటూ ఆందోళన చెందుతున్నారు. శనివారం చిన్న పాటి చినుకు లకు కేంద్రాలలో ధాన్యం పోసిన రైతులందరు ధాన్యం తడువకుండా పర దాలు తెచ్చి కప్పుతూ భయం భయంగా గడుపుతున్నారు. ఇప్పటికైనా అ ధికారులు ధాన్యం తూకం ప్రారంభించి పండిన పంట నీటిపాలు కాకుం డా కాపాడాలని రైతన్నలు కోరుతున్నారు.

తూకం కోసం ఎదురు చూస్తున్న రైతులు

కొడిమ్యాల: మండలంలోని కొడిమ్యాల, పూడూర్, తిర్మాలాపూర్, సింగిల్ విండోల ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించు ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు సు మారు 10 రోజుల క్రితం ప్రారంభించారు. దీంతో ధాన్యం కేంద్రాలకు చేరుతోంది. నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతం కావటంతో తా ము కేంద్రాలలో పోసిన ధాన్యం తడిసి పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించిన అధికారులు, అధి కారులు తూకం వేసి తాము నష్ట పోకుండా కాంటాలను పెట్టి తూకం వేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా రెండు రోజుల్లో తాము కాంటాలను పెట్టి తూకం వేయనున్నట్లు తెలిపారు.

ఫైనాన్స్ నిర్వాహకుల ఇళ్లపై పోలీసుల దాడులు

●రూ. 30.82 లక్షల నగదు, 619 ప్రాంసరీ నోట్స్ స్వాధీనం ●32 చెక్కులు, కిలోన్నర బంగారం సీజ్



జగిత్యాలలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 13: అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహిస్తున్న ఇళ్లపై జిల్లా పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రూ. 30,82,020 నగదు, రూ.4,45,24,800 విలువ గల 619 ప్రాంసరీ నోట్స్, రూ.1,53,62435 విలువ గల 32 చెక్కులు, రూ. 2,50,000 విలువ గల మార్టిగేజ్ డీడ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు సుమారు కిలోన్నర బంగారాన్ని పట్టుకున్నారు. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన నిబంధనలకు లోబడి ఫైనాన్స్ నిర్వహించాలన్నారు. అధిక వడ్డీలతో సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పరిధిలో జగిత్యాల, జగిత్యాల రూరల్, కోరుట్ల, మెట్‌పెల్లి, ఇబ్రహీంపట్నం, ధర్మపురి, మల్యాల, రాయికల్, గొల్లపెల్లి పట్టణాల్లో ఏక కాలంలో తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్ధతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలన్నారు. ఆర్‌బీఐ నియమ నిబంధనలు, తెలంగాణ మని లెండింగ్ చట్టంలోని నిబంధనల ప్రకారం చట్టబద్ధంగా ఎవరైనా సరే లైసెన్స్‌తో అప్పులు ఇవ్వవచ్చు, తీసుకోవచ్చునన్నారు. జగిత్యాల లో ఐదుగురు, జగిత్యాల రూరల్, బుగ్గారం, గొల్లపల్లి, కోరుట్లలో ఒక్కొక్కరు చొప్పు న, మెట్‌పెల్లి, రాయికల్‌లో ముగ్గురు చొప్పున, ధర్మపురిలో తొమ్మిది, ఇబ్రహీం పట్నంలో ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో డీఎస్పీలు రఘుచందర్, రవీంద్ర కుమార్, జగిత్యాల టౌన్, రూరల్, కోరుట్ల, మెట్‌పెల్లి, ధర్మపురి, మల్యాల సీఐలు వేణు గోపాల్, ఆరీఫ్ అలీఖాన్, సురేష్, నవీన్, రాంనరసింహా రెడ్డి, రవితో పాటు ఎస్సైలు సిబ్బంది ఉన్నారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలోని వడ్డీ వ్యాపారస్థుల ఇండ్లలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని 16 షాపులు, ఇండ్లలో ఇన్‌చార్జి డీఎస్పీ రవీందర్‌కుమార్, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవిలు తమ సిబ్బందితో కలసి సోదాలు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని ర్యాగల్ల ఎలేశ్వర్ వద్ద నుంచి రూ. 3లక్షల నగదు, రూ. 15లక్షలు విలువ చేసే రెండు ప్రామిసరి నోట్స్, రూ. 83,34లక్షల విలువ గల 7 చెక్కులను, వేముగంటి భూమేశ్వర్ నుంచి లక్ష రూపాయల నగదు, రూ. 63లక్షల విలువ గల 10 ప్రామిసరి నోట్స్, రూ. 3లక్షల వి లువ గల చెక్కులు, ద్యావనపల్లి రాజారాం నుంచి లక్ష రూపాయల నగదు, రూ. 5,70లక్షల విలువ గల రూ. 20 ప్రామిసరి నోట్స్, రూ. 3 లక్షల విలువ గల ఒక చెక్కులను వారి నుంచి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టణానికి చెందిన కట్కం రమేష్ అను వ్యాపారస్థుడు ఇంట్లో సోదాలు చేయడానికి వెళ్లిన సీఐ, ఎస్సైలను అడ్డుకొని గత సంవత్సరం సోదాలు చేసి తమపై కేసుల నమోదు చేశారని, మళ్లీ ఇప్పుడు చేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో అధికారులు సముదాయించి సోదాలు చేశారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని తొమ్మిది మంది వడ్డీ వ్యాపారుల ఇళ్లపై శనివారం పోలీసులు దాడులు చేశారు. వారి వద్ద నుంచి రూ 6,23,000 నగదు, 65 ప్రామిసరీ నోటులు, 23 బాండ్ పేపర్లు స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పర్యవేక్షణలో ధర్మపురి సీఐ ఏ. రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉమాసాగర్, శ్రీధర్‌రెడ్డి తొమ్మిది మంది వ్యక్తుల ఇళ్లపై దాడులు నిర్వహించారు. అక్రమంగా చిట్టీలు నడుపుతున్న, అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వేముల సత్యనారాయణ, చుక్క శంకర్, అక్కెనపెల్లి సంపత్, తోట రవిరాజు అలియాస్ రాజన్న, బండపెల్లి సత్తయ్య, సాక సత్యనారాయణ, సిరుపతి రాజన్న, సయ్యద్ ఆసిఫ్, గుండ రమేష్ ఇళ్లు, షాపులపై రైడ్ చేసి వారి వద్ద నుంచి నగదు, ప్రామిసరీ నోటులు, 23 బాండ్ పేపరులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కోరుట్ల : పట్టణంలోని వివిధ వార్డులలో వడ్డి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి ఇండ్లలో శనివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. పట్టణంలోని నాలుగు టీంలుగా ఏర్పడి ఎకకాలంలో సొదాలను జరిపారు. పట్టణంలోని అరిపేల్లి రాజేశం ఇంట్లో రూ. 69 లక్షల విలువ గల ప్రామిసరీ నోట్స్ రిజిస్టేషన్ పత్రాలతో పాటు రూ. 1,28,000 నగదు పట్టుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. మరి కొంత మంది ఇండ్లలో రిజిస్ట్రేషన్, ప్రామిసరీ పత్రాలు స్వాధీనం చేసుకోని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు రా యికల్ పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న పలు వ్యక్తుల షాపులు, ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఇటిక్యాలకు చెందిన శ్రీని వాస్ వద్ద నుంచి రూ.18 లక్షలు విలువ గల 22 ప్రామిసరీ నోట్లు, అల్లీపూర్‌కు చెందిన రాజు వద్ద నుంచి సుమారు రూ.లక్షా 85 వేల విలువ గల 2 ప్రామిసరీ నోట్లను జప్తు చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

మల్యాల: అధిక లాభార్జనే ధ్యేయంగా అక్రమంగా చిట్టీలు నడుపడం, అధిక వడ్డీలు వసూలు చేస్తున్న ఫైనాన్స్ నిర్వహకులు, వడ్డీ వ్యాపారస్తుల ఇళ్లపై సీఐ నీ లం రవి ఆధ్వర్యంలో శనివారం పోలీసులు దాడులు చేశారు. మల్యాల, ముత్యం పేటకు చెందిన అయిదుగురు ఇళ్లపై వాడులు చేశారు. వారి వద్ద ఎలాంటి లావాదేవిల ఆధా రాలు లభించనట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

రాయికల్, ఏప్రిల్ 13: రాయికల్ మండలంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శనివారం పలువురు బాధిత కుటుంబాలను పరామర్శిం చారు. మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త వొ ల్లాల అరుణ్ తండ్రి రమేష్ అనారోగ్యంతో ఇటీవల మరణించగా వారి కుటుం బసభ్యులను పరామర్శించారు. గ్రామానికి చెందిన కార్యకర్త కొడిమ్యాల రాజు తండ్రి బాలయ్య అనారోగ్యంతో బాధ పడుతుండగా వారిని పరామర్శించి ఆరో గ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పట్టణంలోని 11వ వార్డుకు చెందిన యూత్ నాయకుడు ఆకు రాజేందర్ తల్లి ఆకు రాజు ఇటీవల మరణిం చగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, శ్రీధర్‌రెడ్డి, బాబా, మహేందర్, హాస్సేన్, రామ్మూర్తి, శేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దొంతి నాగరాజు, మాజీ సర్పంచ్ స్వప్న వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ తిరుపతి గౌడ్ ఉన్నారు.

'దేశ అభివృద్ధికి మోదీ నాయకత్వం అవసరం'

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 13 : దేశ అభివృద్ధికి మరోమారు నరేంద్ర మోది నాయకత్వం అవసరమని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి, మున్సిపల్ మాజీ చైర్మన్ బోగ శ్రావణి అన్నారు. శనివారం మండలంలోని యూసుఫ్ నగర్ గ్రా మంలో శక్తి వందన్ అభ్యాన్ కార్యక్రమంలో భాగంగా కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ సుఖేంధర్ గౌడ్‌లతో పాటు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఉపాధి హామీ కార్మికులను కలిసి వారికి ఓఆర్ఎస్ అందించి కేంద్ర ప్రభుత్వం చేస్తు న్న అభివృద్ధి పనులను విరిస్తూ మహిళ శక్తిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సమావేశంలో బోగ శ్రావణి మాట్లాడారు. రైతు ప్రయోజనాల కోసం నరేంద్ర మోదీ పని చేస్తూ దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిజామాబాదు పార్లమెంట్ పరిధిలో పసుపు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసాడని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో నిజామాబాదు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి దర్మపురి అర్వింద్‌ను గెలిపించి నరేంద్ర మోది నాయకత్వను బలపరుచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యాక్షుడు రుద్ర శ్రీనివాస్ నాయకులు యాదగిరి బాబు, పంచరి విజయ్ కుమార్, అంబల్ల సుఖేందర్ గౌడ్, వెంకటరెడ్డి రాజు, మల్లారెడ్డి, ఏలేటి రాజు, ఏలేటి లింగారెడ్డి, భూమనందం, సుధాకర్‌లతో మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా నాగులమ్మ జాతర మహోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 13 : మండలంలోని నాగులపేట గ్రామంలోని నాగులమ్మ దేవాలయంలో జాతర మహోత్సవం శనివారం వైభవంగా సాగింది. గ్రామస్థుల ఆద్వర్యంలో నిర్వహించిన జాతర మహోత్సవంను వేదపండితులు బహ్మన్నగారి శంకర్ శర్మ, కిషన్, రాములు మత్రోత్సరణ మద్య సాగింది. దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన వేదపండితులు అర్చన అభిషేక కార్యక్ర మాలను జరిపారు. ప్రత్యేక వేదికపై రాజరాజేశ్వర స్వామి కళ్యాణంను కన్నుల పండవగా నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో రాజరాజేశ్వర ఉత్సవ మూర్తులను శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వర కల్యాణం నిర్వహించారు. మహిళలు దేవాలయ అవరణలో ఉన్న పుట్టలలో పాలు పోసి మొక్కులు చెలించుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, నిజామాబాదు ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్‌పీటీసీ సభ్యురాలు దారిశెట్టి లావణ్య-రాజేష్, ఎంపీపీ తోట నారాయణలు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంతం రాజం, నాయకులు వెంకటేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్‌లు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. వీరికి దేవాలయ పురోహితుడు బ్రహ్మనగారి శంకర్ శర్మ దేవాలయ జ్ఞాపికలను అందించి ఆశ్వీరదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బాస్కర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ నర్సరెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 13: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని 36వ వార్డులో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళతో మాటా ముచ్చట కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు, వార్డు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల అమలు తీరును వివరించారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మహిళా విభాగం కాంగ్రెస్ నాయకురాళ్లు ఉన్నారు.

ప్రభుత్వ విప్ ఆర్థిక సాయం

ధర్మపురి, ఏప్రిల్ 13: ధర్మపురి మండలంలోని నేరెళ్ల మాజీ ఎంపీటీసీ ఇంద్రాల మల్లేశం రోడ్డు ప్రమాదంలో గాయపడగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ నేతలు శనివారం ఆర్థికసాయం అందించారు. గత వారం రోజుల క్రితం మల్లేశం కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లాకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కారు ఢీకొట్టడం వల్ల కాలు విరిగింది. విషయాన్ని తెలుసుకున్న ప్రభుత్వ విప్ వైద్య చికిత్స నిమిత్తం రూ 20,000, నేరెళ్ల-గోవింద్‌పల్లె కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ కమిటీ నుంచి రూ 20,000, గ్రామ శాఖ అధ్యక్షులు కాసారపు బాలాగౌడ్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జాజాల రమేష్ మరి కొందరు కలిసి రూ 10,000 ఆర్థికసాయం అందించారు. ఈ మొత్తం కలిపి రూ 50,000 నిర్మల్ జిల్లాలో ఉన్న మల్లేష్ కుటుంబ సభ్యులను నేతలు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జుంజూరు అశోక్, పాదం శంకర్, తొట్ల రాజన్న, మాడిశెట్టి లక్ష్మణ్, జంగిలి తిరుపతి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎండపల్లి, ఏప్రిల్ 13 : మండలంలోని కొత్తపేట గ్రామంలో జేఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీరెడ్డి మహేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ప్రజల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు గానూ ఆయనకు విప్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హన్మాండ్లు

మల్లాపూర్, ఏప్రిల్, 13 : కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన బోయి నిహన్మాండ్లును నియమించిన పత్రాని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి శనివారం అయనకు అందజేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా ఉన్నయని ప్రతి ఒక్కరు సీఎం రేవంత్‌రెడ్డికి మద్ధతు పలికాలన్నారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అయిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అ త్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత అన్ని వర్గాల ప్రజలపైన ఉందన్నారు. విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన నియమాకానికి సహకరించిన వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌గౌడ్, రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి, పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరం చంద్, విజయ్‌ఆజాద్, నియోజక ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు. హన్మండ్లు నియమాకంతో మండలంలోని నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనాలు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి జాతర

గొల్లపల్లి, ఏప్రిల్ 13: గొల్లపల్లి మండలం ఉమ్మడి వెనుగుమట్ల బొంకూరు గ్రామంలో వేంకటేశ్వర స్వామి జాతర ఘనంగా నిర్వహించారు. జాతర మహోత్సవంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం వారికి ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగాధర్, ఎంపీటీసీ శ్రీధర్, రాజారావు,తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

రాయికల్, ఏప్రిల్ 13: రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ముత్తినేని వీరయ్యను హైదరాబాద్‌లోని తన నివాసంలో మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన దివ్యాంగురాలు, కూచిపూడి కళాకారిణి బొమ్మకంటి అంజనశ్రీ (జూనియర్ సుధాచంద్రన్) శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపింది. వీరయ్య కూచిపూడి కళాకారిణి అంజనశ్రీని శాలువాతో సన్మానించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కూచిపూడిలో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు.